సాక్షి
మంచిర్యాల
బుధవారం ၊ 20 ၊ డిసెంబర్ ၊ 2023



భగ్గుమంటున్న ధరలు
మొన్నటి వరకు రూ.100కు మూడు నుంచి నాలుగు కిలోలు వచ్చిన కూరగాయలు ప్రస్తుతం కిలోకు వందపైనే ధర పలుకుతున్నాయి. రోజురోజుకూ పైపైకి చేరుతున్నాయి. 8లో▸



పేరుకే వంద పడకలు
బెల్లంపల్లిలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఏరియా ఆస్పత్రిగా మారినా మార్పే మీ లేదు. పోస్టులు భర్తీ ప్రతిపాదనలకే పరిమితమైంది. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
27.0 / 14.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి.

న్యూస్‌రీల్

30న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి రవి

చెన్నూర్: చెన్నూర్ కోర్టులో ఈ నెల 30న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెన్నూర్ సివిల్ జడ్జి పి.రవి తెలిపారు. మంగళవారం కోర్టులో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో పోలీసులు, న్యాయవాదులు సమన్వయంతో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. చెన్నూర్ కోర్టు పరిధిలోని చెన్నూర్, భీమారం, జైపూర్, కోటపల్లి, నీల్వాయి పోలీసుస్టేషన్ల పరిధిలో ఉన్న కేసుల పరిష్కారానికి ఇరుపక్షాలతో మాట్లాడాలని తెలిపారు. ఏపీపీ ప్రేమలత, ఏజీపీ రాంభావు, బార్ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన కలెక్టర్ సంతోష్



మనిప్రసాద్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: జాతీయ స్థాయి పోటీల ఇన్‌స్పైర్ అవార్డు గ్రహీత కోటపల్లి మండలం అన్నారం ఉన్నత పాఠశాల విద్యార్థి మనిప్రసాద్‌ను కలెక్టర్ బి.సంతోష్ మంగళవారం తన కార్యాలయంలో శాలువాతో సన్మానించి అభినందించారు. మూడు రోజుల పాటు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో మనిప్రసాద్ గైడ్ ఉపాధ్యాయుడు ఎస్.సురేందర్ సహాయంతో అవార్డు కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు జాతీయ స్థాయిలో అవార్డు తీసుకు రావడం అభినందనీయమని అన్నారు. బాల శాస్త్రవేత్త మనిప్రసాద్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి నూతన ఆవిష్కరణలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీలు ప్రారంభిస్తున్న యాదయ్య

నస్పూర్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా కృష్ణాకాలనీ కేరళ మోడల్ హైస్కూల్‌లో మంగళవారం అండర్ -14, 17 బాలబాలికల రాష్ట్ర స్థాయి 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చెస్ అండ్ సెలక్షన్ పోటీలను డీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలుపైనా దృష్టి సారించాలన్నారు. పోటీలు ఈ నెల 20 వరకు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపా రు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పరిమళ, అబ్జర్వర్ కరుణాకర్‌రెడ్డి, కుమురంభీం జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట సుధాకర్, చీఫ్ ఆర్బిటర్ రామయ్య, పాఠశాల కరస్పాండెంట్ జార్జ్ పాల్గొన్నారు.

సీఓఈల్లో ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) జూనియర్ కళాశాలల్లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బెల్లంపల్లి సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. వచ్చే జనవరి 15వరకు దరఖాస్తుకు తుది గడువు ఉందని తెలిపారు. రూ.200 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 38 సీఓఈల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి వీలుందని తెలిపారు. సీఓఈల్లో ఐఐటీ, నీట్, సీఎంఏ, క్లాట్ పోటీ పరీక్షల కోసం ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పరీక్షలో మెరిట్ ఆధారంగా అడ్మిషన్‌కు అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు.

21నుంచి పత్తి కొనుగోళ్లు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సీసీఐ జిన్నింగ్ మిల్లులో ఈ నెల 21నుంచి పత్తి కొనుగోలు చేయనున్నట్లు సీసీఐ సీపీవో ఉదయ్‌షా ఒక ప్రకటనలో తెలిపారు. మిల్లులో సాంకేతిక లోపం ఉన్నందున కొద్ది రోజులు నిలిపి వేశామని, తిరిగి కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు 8 నుంచి 12 శాతం తేమతో తీసుకురావాలని కోరారు.

వాడుతున్న గులాబీ వనం !

- బీఆర్‌ఎస్ నుంచి మూకుమ్మడిగా కాంగ్రెస్‌లో చేరికలు
- జిల్లాలో కౌన్సిలర్లను కాపాడుకోలేక అవసోపాలు
- లోక్‌సభ, స్థానిక ఎన్నికలకు ముందే ఇబ్బందులు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: శాసనసభ ఎన్నికల ఫలితాల తర్వాత జిల్లాలో గులాబీ పార్టీ రోజుకు రోజుకు మరింత బలహీన పడుతోంది. దశాబ్దకాలం పాటు జిల్లాలో చక్రం తిప్పిన బీఆర్‌ఎస్ పార్టీ తీవ్రమైన గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది. పార్టీ అధికారంలో ఉండగా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఇళ్లు, కార్యాలయాలు కళకళలాడేవి. ఓటమితో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. ఆ పార్టీ కళ తప్పిపోవడంతో కేడర్ సైతం క్రమం దూరమవుతోంది. గెలుపు ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ కేడర్ మరింత దూకుడుగా ముందుకెళ్తోంది. బీజేపీ సైతం పట్టు పెంచుకునే ప్రయత్నాల్లోనే ఉంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి క్షేత్రస్థాయి వరకు పార్టీని పటిష్టం చేసి బలమైన అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నాయి. రెండు జాతీయ పార్టీలు పార్లమెంటు ఎన్నికల కోసం పూర్తి స్థాయిలో సంసిద్ధతతో ఉన్నాయి. బీఆర్‌ఎస్ పార్టీలో ఇంకా అలాంటి కసరత్తులేవీ జరగడం లేదు. దీంతో ఏళ్లుగా పార్టీ జెండాను నమ్ముకున్న కార్యకర్తలు, నాయకులు తీవ్ర నిరాశలో పక్క చూపులు చూస్తున్నారు.

'చేయి' కలుపుతున్న కేడర్

'కారు' పార్టీలో ఉంటే తమ రాజకీయ భవిష్యత్ ఇబ్బందికరమని భావించి మూకుమ్మడిగా పార్టీ మారుతున్నారు. స్థానిక సంస్థల నుంచి జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులు, నాయకుల వరకు అందరూ అధికార కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఇక మున్సిపాలిటీల్లోని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు అన్ని రకాల 'ఆఫర్లు' ఇచ్చినా నిలవడం లేదు. మంచిర్యాల పట్టణంలో ఉదయం పూట 'ఆఫరు' చేతిలో పడ్డాక కూడా సాయంత్రం పార్టీ మారుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మాజీ ఎమ్మెల్యేలు తమ పార్టీ కౌన్సిలర్లు, నాయకులను ఆపడం కష్టతరంగా మారింది. జిల్లాలో ఆరు మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరిగితే అన్ని చోట్ల బీఆర్‌ఎస్ పార్టీ వారే చైర్‌పర్సన్లు, వైస్ చైర్మన్లుగా, మెజార్టీ సభ్యులు ఉన్నారు. నాలుగేళ్ల తర్వాత పరిస్థితి తారుమారైంది. ప్రస్తుతం బీఆర్‌ఎస్ పార్టీ నుంచి వరుసబెట్టి కాంగ్రెస్‌లో చేరికల జోరు నడుస్తోంది. బెల్లంపల్లి, మంచిర్యాల, నస్పూర్ పట్టణాల్లో కౌన్సిలర్లు పార్టీ మారి చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. ఇక చెన్నూరు, క్యాతనపల్లి, లక్సెట్టిపేటలో అంతర్గతంగా చర్చలు సాగుతున్నాయి. అక్కడి కౌన్సిలర్ల రాకను కాంగ్రెస్ పార్టీలోనే వ్యతిరేకిస్తుండడంతో చేరికలకు కొంత అంతరాయం కలుగుతోంది. ఇక మందమర్రిలో పాలకవర్గం లేనప్పటికీ స్థానిక నాయకులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు.

'గుర్తింపు' సంఘం ఎన్నికల్లోనూ..

సింగరేణి గుర్తింపు సంఘ ఎన్నికల నిర్వహణలో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఎవరూ కనిపించడం లేదు. అనుబంధ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) నాయకులు సైతం అసంతృప్తిలో ఉన్నారు. ఎన్నికలపై గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో ఇక్కడి కార్మిక నాయకులు సమావేశం అయ్యారు. మాజీ ఎమ్మెల్యేల ప్రచారం, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపకపోవడంతో గనులపై ఆ సంఘం నాయకులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో తమ దారి తాము చూసుకునే పనిలో ఉన్నారు. కొందరు సంఘం వీడారు. ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో ఆదేశాలు అనుకూలంగా వస్తే నాయకుల మార్పులు ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే కీలక కార్మిక నాయకులు కాంగ్రెస్ పెద్దల టచ్‌లోకి వెళ్లారు. తమ సంఘంలోకి రావడాన్ని కొందరు వ్యతిరేకిస్తుండడంతో అక్కడ బ్రేక్ పడినట్లు తెలుస్తోంది.

పత్తాలేని పార్టీ జిల్లా అధ్యక్షుడు

చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న బాల్క సుమన్ జిల్లా వైపు చూడడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు జిల్లాలోని మిగతా ఎమ్మెల్యేల కంటే అన్నింటా ముందుండే ఆయన ఇప్పుడు కంటికి కనిపించడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు. శాసనసభ ఎన్నికల ఫలితాల తర్వాత స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు, సమీక్షలు నిర్వహించాల్సి ఉన్నా ఆ వైపు చూడడం లేదు. దీంతో స్థానిక కేడర్ తీవ్ర నిరాశలో ఉంది. కష్టకాలంలోనూ పార్టీ జెండానే మోస్తున్న వారికి ధైర్యం నింపాల్సిన సమయంలో జిల్లా అధ్యక్షుడు సైతం అందుబాటులో లేకపోవడంతో నిరాశ కలిగిస్తోంది. వచ్చే లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ అపజయం మూటకట్టుకోవాల్సి వస్తే కొన్నేళ్లపాటు జిల్లాలో మనుగడ కష్టమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా కేంద్రాన్ని హెల్త్ హబ్‌గా మారుస్తా

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాలను హెల్త్‌హబ్‌గా మార్చి రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన నివాస గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఐబీ స్థలంలో గత ప్రభుత్వం అనాలోచితంగా నిర్మించిన మార్కెట్ కాంప్లెక్స్ భవనాన్ని మాతాశిశు ఆస్పత్రిగా మారుస్తామని స్పష్టం చేశారు. ఐటీఐ స్థలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తామని, ఇందుకు కొంత సమయం తీసుకున్నా ఆస్పత్రుల ఏర్పాటులో వెనుకడుగు వేసేదే లేదని చెప్పారు. గంజాయి అమ్మకాలు, అక్రమ దందాలు, చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. బెల్ట్‌షాపులను నిషేధించడం, గంజాయి నివారణకు నార్కోటిక్ పోలీస్ బృందాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని అన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీఆర్‌ఎస్ నుంచి స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్

మంచిర్యాలక్రైం: బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్ సురేష్‌బల్దువా మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మంగిలాల్ సోమాని తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఉపాధిని కాపాడండి



కలెక్టర్ బి.సంతోష్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: తమ ఉపాధిని కాపాడాలని బీఎంఎస్ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లగిశెట్టి కమలాకర్, మద్దూరి రాజుయాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా మహిళలు సంతోషంగా ఉన్నా.. ఆటోడ్రైవర్ల కుటుంబాలు సంతోషంగా లేవని అన్నారు. జిల్లా కేంద్రంతోపాటు మారుమూల గ్రామాలకు ఆటోలో ప్రయాణించే 70 శాతం మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా వెళ్తున్నారని, దీంతో ఆటోలకు గిరాకీలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. ఉచిత ప్రయాణంపై పునరాలోచన చేయాలని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓలా, ఉబర్, రాపిడ్ బైక్‌ల అక్రమ వ్యాపారాన్ని నిషేధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు శ్రీనివాస్, ముఖిత్, సంతోష్ కుమార్ యాదవ్, అంకూస్, నరేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన శివాణి

మంచిర్యాలక్రైం: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని సీహెచ్.శివాణి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి తెలిపారు. ఈ నెల 17, 18వ తేదీల్లో కాకతీయ యూనివర్సిటీ మైదానంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో ఎంపిక చేశారని పేర్కొన్నారు. చెన్నయ్‌లోని పెరియార్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. శివాణిని కళాశాల పీడీ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ శివలీల, కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు..

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని ప్రజ్ఞ జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లలితకుమారి తెలిపారు. ఈ నెల 16న తొర్రూర్‌లో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో పాల్గొని ఎంపికైనట్లు తెలిపారు. జాతీయస్థాయి క్రీడా పోటీలు త్వరలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందిచారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సీపీఐ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

పాతమంచిర్యాల: సీపీఐ ఆవిర్భావ వేడుకలు ఈ నెల 20 నుంచి 26వరకు ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ దశాబ్దాలుగా పేదలు, కార్మికులు, బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం పోరాటాలు నిర్విరామంగా సాగిస్తోందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పని చేస్తూ గ్రామ గ్రామాన అరుణ పతాకాలు ఎగురవేసి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ నెల 26న సాయంత్రం మంచిర్యాలలో ఆవిర్భావ వేడుకల సందర్భంగా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తామని, కార్మికులు, కర్షకులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్

ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ఖలిందర్ అలీఖాన్, మిట్టపల్లి శ్రీనివాస్, లింగం రవి, జిల్లా సమితి సభ్యులు దేవి పోచన్న, లక్ష్మీనారాయణ, పౌలు, రాజేశ్వర్‌రావు, సాంబయ్య, రవీందర్, మేకల రాజేశం, సత్తయ్య, రామన్న, రాయమల్లు, మారంపల్లి రవి పాల్గొన్నారు.

ఆర్టీసీకి 'మహా' ఆదాయం..!

- బస్సుల్లో రెట్టింపు ప్రయాణం
- 60శాతం మంది ప్రయాణికులు మహిళలే..
- పరిమితికి మించి తరలింపు
- అప్రమత్తం కాకుంటే పొంచి ఉన్న ప్రమాదం



మంచిర్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ప్రయాణికులు

తేదీ	ఆదాయం(రూ.లలో)	ప్రయాణికులు	మహిళలు	చిన్నారులు
16	32,38,780	63,014	36,620	949
17	31,07,565	58,899	31,817	1382
18	35,53,432	67,254	38,326	1054



మంచిర్యాలఅర్బన్: మొన్నటి వరకు 'రండమ్మా.. రండి..' అనేది ఆర్టీసీ నినాదం. ప్రస్తుతం మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ఆర్టీసీ బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణం సాగుతోంది. ఒకప్పుడు ఖాళీ సీట్లతో రాకపోకలు సాగించిన బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యానికి మించి ఆదాయం వస్తోంది. సొంత వాహనాలు, ప్రైవేట్ వాహనాల కంటే ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సాగిస్తుండడంతో ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. సాధారణ రోజుల్లో రూ.26లక్షల నుంచి రూ.28లక్షల నిర్దేశిత ఆదాయ లక్ష్యానికి గాను రూ.20 లక్షల నుంచి రూ.30లక్షలు దాటని పరిస్థితి. ప్రస్తుతం రోజువారీ ఆదాయం రూ.32లక్షలకు పైగా సమకూరుతోంది. ఇది వరకు 42వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయాల్సి ఉండగా ప్రస్తుతం 55వేల నుంచి 60వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో కొన్ని బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) రెట్టింపైంది. జీరో టికెట్ అమలు తర్వాత ప్రయాణికుల్లో మహిళలే 60శాతం ఉన్నట్లు తేలింది. ఈ నెల 16నుంచి 18వ రకు మహిళలకు జీరో టికెట్‌పై 1,89,167 మంది ప్రయాణించగా రూ.98,99,777 ఆదాయం సమకూరింది. ఇందులో మహిళలు, చిన్నారులు 1,10,148 ప్రయాణించారు. మొత్తం ఆదాయంలో ఉచిత ప్రయాణం చేసే మహిళలు, చిన్నారుల నుంచి రూ.42,58,015 ఆదాయం వచ్చింది. ఉచిత టికెట్ చార్జీలను ప్రభుత్వం చెల్లించే అవకాశం ఉండడంతో ఆర్టీసీ ఆదాయంగానే పరిగణిస్తుంది.

పరిమితికి మించి..

మంచిర్యాల డిపోలో 142 బస్సులు ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. బస్సుల్లో రాజధాని 7, సూపర్‌లగ్జరీ 25, ఎక్స్‌ప్రెస్ 7, పల్లెవెలుగులు 35 ఉన్నాయి. అద్దె బస్సుల్లో ఎక్స్‌ప్రెస్ 14, పల్లెవెలుగు 54 రాకపోకలు సాగిస్తున్నాయి. రోజుకు 60 వేల కిలోమీటర్లు బస్సులు తిప్పడం ద్వారా రూ.28 లక్షల ఆదాయం రావాల్సి ఉంది. పల్లె బస్సుల్లో 55సీట్లు, సూపర్ లగ్జరీలో 36, రాజధానిలో 40, ఎక్స్‌ప్రెస్‌లో 50 సీట్లు ఉంటాయి. ప్రస్తుతం కొన్ని బస్సుల్లో 140 మందికి పైగా ప్రయాణిస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. కరీంనగర్ బస్టాండ్‌లో మంచిర్యాల డిపో బస్సు నిలిపి డ్రైవర్ టీ తాగి వచ్చేసరికి కూర్చోటానికి వీలులేకుండా ఉండడంతో ఆశ్చర్యానికి లోనయ్యాడు. నిబంధనలు ఉల్లఘించి ప్రయాణికులు బస్సుల్లో ఎక్కడంతో బస్సుకు ఇరువైపులా, వెనకాల వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితులు ఉన్నాయని డ్రైవర్ వాపోయాడు. గతంలో పరిమితికి మించి ప్రయాణంతో కొండగట్టు ఘటనతోపాటు పలు ప్రమాద ఘటనలను గుర్తు చేస్తున్నారు.

సిబ్బంది కొరత

ఆర్టీసీ డిపోలో 522 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో 231 మంది కండక్టర్లు గాను 218 మంది, 191 మంది డ్రైవర్లలో 186 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ లెక్కన 13మంది కండక్టర్లు, ఐదు డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆరేళ్లకు పైగా నూతన నియామకాలు లేకపోవడం.. పదవీ విరమణ పొందడం.. ఇతరత్రా కారణాల వల్ల సిబ్బంది తగ్గిపోయారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు ఒత్తిడితో అనారోగ్యం బారిన పడుతున్నారు.

టికెట్ జారీలో సాంకేతిక సమస్య

ప్రయాణికులకు టికెట్ జారీలో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. జీరో టికెట్ ముగ్గురికే పరిమితి ఉండడంతో సమయం ఎక్కువగా పడుతోంది. టికెట్ జారీ పరిమితి పెంచాలనే డిమాండ్ ఉంది. ఒక్క టికెట్ జారీకి మూడు సెకండ్ల సమయం పడుతుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. 100కు పైగా ప్రయాణికులు బస్సు ఎక్కినప్పుడు టికెట్లు జారీ చేసే సరికి స్టేజీ వస్తుండడంతో దిగి వెళ్లిపోవడం వల్ల గందరగోళంగా మారుతోంది. చెన్నూర్ దాటిన లక్ష్మీపూర్ నుంచి మహారాష్ట్ర ఉంటుంది. ఇక్కడి నుంచి వెళ్లే ప్రయాణికులు ఆ రాష్ట్రంలో కూడా టికెట్ తీసుకోకుండా ఫ్రీ జర్నీ అంటూ మడతపేచీ పెడుతుండటం ఉద్యోగులను గందరగోళానికి గురి చేస్తోంది. బస్సుల్లో జీరో టికెట్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

- మంచిర్యాల నుంచి శ్రీరాంపూర్ బస్టాండ్‌కు వచ్చిన బస్సు ప్రయాణికులతో కిక్కిరిసి ఉంది. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. అక్కడే ఉన్న ఉద్యోగి ఓ మహిళను ఆగండమ్మా.. వెనకాల ఓ బస్సు వస్తుంది అందులో వెళ్లొచ్చు అంటే తమ వాళ్లు ఇందులోనే ఉన్నారంటూ ఫుట్‌బోర్డుపై నిల్చుని వెళ్లింది.
- కరీంనగర్ వయా లక్సెట్టిపేట మీదుగా మంచిర్యాలకు వచ్చే బస్సులో 140 మంది ప్రయాణించారు. బస్సు ఎక్కేటప్పుడు ఓ ప్రయాణికుడు అదుపు తప్పి కిందపడ్డాడు. ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది.

'కడెం'ను సందర్శించిన స్కాడా బృందం

కడెం: కడెం ప్రాజెక్టును స్కాడా(సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా ఆక్విషన్)ఎక్స్‌పర్ట్ రాకేశ్‌బట్‌తో కలిసి బృందం మంగళవారం సందర్శించింది. గతేడాది ప్రారంభించిన స్కాడా సిస్టం పనులను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్ట్ పాత జనరేటర్ రూంలో ఏర్పాటు చేసిన స్కాడా సిస్టం పనితీరును తనిఖీ చేశారు. ప్రాజెక్టుపై స్కాడా పనులు 80 శాతం పూర్తయ్యాయని, గేట్ల మరమ్మతులు పూర్తయ్యాక స్కాడా సిస్టం ప్రారంభిస్తామని ఏఈఈ ఏఆర్‌ఎస్.శర్మ పేర్కొన్నారు. బృందం వెంట డీఈఈ మాధవి, ఏఈఈ రమాదేవి, ప్రాజెక్టు డీఈఈ భోజదాసు, ఏఈఈ రవికుమార్ ఉన్నారు.



గేట్ల వద్ద పనులను పరిశీలిస్తున్న స్కాడా అధికారులు

క్లుప్తంగా

ఎనిమిది రైళ్లు రద్దు

కాగజ్‌నగర్‌టౌన్: హసన్‌పర్తి– ఉప్పల్ రైల్వేస్టేషన్ల మధ్య పనుల కారణంగా ఎనిమిది రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. కాజీపేట– హసన్‌పర్తి, బల్లార్షా– కాజీపేట, కరీంనగర్– సిర్పూర్, సిర్పూర్– కరీంనగర్ రైళ్లు ఈ నెల 19 నుంచి జనవరి 13 వరకు రద్దయ్యాయి. బోధన్– కరీంనగర్ రైలు ఈ నెల 20 నుంచి జనవరి 14 వరకు, కరీంనగర్– బోధన్ రైలు ఈ నెల 19 నుంచి జనవరి 13 వరకు, సికింద్రాబాద్– సిర్పూర్ కాగజ్‌నగర్, సిర్పూర్ కాగజ్‌నగర్– సికింద్రాబాద్ రైళ్లు జనవరి 2 నుంచి 13వ తేదీ పట్టాలు ఎక్కవు. కనిష్టంగా 12 రోజుల నుంచి గరిష్టంగా 26 రోజుల పాటు ఈ రైళ్లు తిరగవని రైల్వేశాఖ వెల్లడించింది.

ప్రమాదవశాత్తు లారీ డ్రైవర్ మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెరలో ప్రమాదవశాత్తు లారీ అదుపుతప్పి డ్రైవర్ గోపు సుబ్బారావు (52) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జైపూర్ మండలం టేకుమట్ల రైస్ మిల్లులో లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న సుబ్బారావు రోజులాగే లారీని తీసుకుని మంగళవారం కొమ్మెరలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు వచ్చాడు. లారీని వెనుకకు తిప్పుతున్న క్రమంలో లారీకి వెనుక వైపు ఉన్న ఉపాధి హామీ వివరాలు తెలిపే గోడకు తగిలింది. లారీలో నుంచి డ్రైవర్ సుబ్బారావు అకస్మాత్తుగా లారీలోంచి టైర్ కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చెన్నూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు.

రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించాలి



ఎంపికైన క్రీడాకారులతో సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఈ నెల 23 నుంచి 25 వరకు హైసదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రథమ స్థానం సాధించాలని బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పురుషులు, మహిళా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. సీనియర్ క్రీడాకారుల సూచనలు, సలహాలు పాటిస్తూ క్రీడానైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు. మంగళవారం గోలేటిలో ప్రారంభమైన కోచింగ్ క్యాంపు మూడు రోజులపాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సింగరేణి పాఠశాల హెచ్‌ఎం రవితేజ, షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సింగరేణి హైస్కూల్ పీఈటీ భాస్కర్, బాల్‌బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ రెఫరీ మల్లేశ్, సీనియర్ క్రీడాకారులు నరేశ్, పీఈటీ స్వరూప పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

ఆదిలాబాద్‌రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగిన సామగ్రి దగ్ధమైన ఘటన మండలంలోని రామాయి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జట్టే కిషోర్ ఇంట్లో మంగళవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు గంట పాటు శ్రమించి మంటలను ఆర్పేశారు. దీంతో గ్రామంలో పెద్ద ప్రమాదం తప్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ ప్రమాదంలో ఇంట్లోని ఫ్రిజ్, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి.

భగ్గుమంటున్న ధరలు

- కూరగాయల రేట్లు పైపైకి..
- టమాటా మినహా అన్నీ కిలో రూ.100 పైనే
- తగ్గిన చికెన్ ధర



మంచిర్యాలఅగ్రికల్చర్: మొన్నటి వరకు వంద రూపాయలకు మూడు నుంచి నాలుగు కిలోలు వచ్చిన కూరగాయలు ప్రస్తుతం కిలోకు వందపైనే ధర పలుకుతున్నాయి. రోజురోజుకూ ధరలు పైపైకి పోతున్నాయి. మార్కెట్‌లో టమాటా మినహా మిగితా కూరగాయల ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. దీంతో సామాన్యులు కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది. మొన్నటి వరకు కిలో చికెన్ రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.180 నుంచి రూ.200కు చేరింది. రోజురోజుకూ చికెన్ ధరలు పడిపోతున్నాయి. కార్తీకమాసం, షష్టి బోనాలు, అయ్యప్ప మాలదీక్షలు, పూజలు, వ్రతాలతో శాఖాహార వినియోగం పెరిగింది. ఈ కారణంగా కూరగాయల ధరలు అమాంతం పెరిపోతున్నాయని కూరగాయల వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో టమాటా రూ.30 ఉండగా చిక్కుడు కాయ, వంకయ రూ.100 నుంచి రూ.120, బెండకాయ, దొండకాయ, గోరు చిక్కుడు, పూగోబి, ఆలసంద, పచ్చిమిర్చి రూ.80 నుంచి రూ.100కే చేరాయి. ములక్కాయలు రూ.200 నుంచి రూ.220 వరకు ధర పలుకుతోంది. కూరగాయలు అధికంగా లభించే డిసెంబర్ మాసంలో ధరలు పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో కూరగాయల దిగుబడి తగ్గిపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. మొన్నటి వరకు తుపాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం టమాట ఎక్కువ దిగుబడి వస్తుండగా మిగితా కూరగాయల సాగు తగ్గిపోవడం, అరకొర వచ్చిన పంటకు మరింత ధర పెరుగుతోంది. ఈ సీజన్లో అధికంగా లభించే చిక్కుడు కాయ, వంకాయ, అనుపకాయలు రూ.100 చేరాయి. నాలుగు నెల క్రితం టమాటా ధర రూ.100 ఉండగా ప్రస్తుతం రూ.30కు చేరడంతో ఊరట చెందిన వినియోగదారులు మిగితా కూరగాయల ధరలు పెరుగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఆకుకూరల ధరలు సైతం అదే తరహాలో ఉన్నాయి. వారం క్రితం తోటకూర, పాలకూర, చుక్కకూర కిలో రూ.30 ఉండగా ప్రస్తుతం రూ.60కి చేరింది.

జిల్లాలో తగ్గిన సాగు

గతంలో జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం 10 వేల ఎకరాల వరకు ఉండేది. కానీ ప్రస్తుతం 4,670 ఎకరాల్లో మాత్రమే సాగులో ఉంది. ఇందులో అధికంగా మిర్చి, టమాటా సాగు ఉంది. నానాటికీ ఇతర కూరగాయల సాగు తగ్గిపోతోంది. కూరగాయల పంటలకు ప్రోత్సాహం లేకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. యాసంగిలో నీటి సౌకర్యం ఉన్న రైతులు కూడా వరి, మొక్కజొన్న పంటలు వేస్తున్నారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. రవాణా భారం, హోల్‌సేల్ వ్యాపారుల కుమ్మక్కుతో కూరగాయల ధరలు మరింత పైపైకి పోతున్నాయి.

తగ్గిన చికెన్ ధరలు

పదిహేను రోజుల క్రితం బాయిలర్ కోడి రూ.120 ఉండగా ప్రస్తుతం రూ.80 నుంచి రూ. 90కి చేరింది. లేయర్ రూ.160 ఉండగా ప్రస్తుతం రూ.110కి చేరింది. కిలో చికెన్ (స్కిన్ లెస్) రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.200, విత్ స్కిన్ రూ.280 ఉండగా ప్రస్తుతం రూ.180కి చేరింది. కూరగాయల ధరలకు రెక్కలు వస్తుంటే చికెన్ ధరలు పడిపోతున్నాయి.

కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో(రూపాయల్లో)
టమాటా	30
మిర్చి	100
బీరకాయ	140
చిక్కుడుకాయ	120
వంకాయ	100
అనుపకాయ	100
బెండకాయ	100
కాకరకాయ	100
గోరుచిక్కుడు	100
దొండకాయ	100
పూగోబి	70
ఆకుగోబి	70
అలుసంద	70
తోటకూర	60
పాలకూర	60
చుక్కకూర	60
క్యారెట్	120
బీట్‌రూట్	120
ములక్కాయలు	220
కొత్తిమీర	140

కూరగాయల కన్నా చికెనే నయం



కిలో వంకాయ రూ.100 ధర పలుకుతోంది. గతంలో ఈ ధర ఎన్నడూ చూడలే. చలికాలంలో కూరగాయల ధరలు తగ్గాలి. కానీ పెరుగుతున్నాయి. కూరగాయల కన్నా చికెన్ ధర తక్కువగా ఉంది. కిలో చిక్కుడుకాయ రూ.150 ధర పెట్టి కొనేకన్న రూ.180 పెట్టి కిలో చికెన్ తీసుకున్నది నయం.

– భీమరాజుల సతీశ్, మంచిర్యాల

ధరలు పెరిగినయ్



షష్టి వారాలు, బోనాల కోసం కూరగాయలు కొందామని మార్కెట్‌కు పోతే టమాట మినహా మిగితా వాటి ధరలు పెరిగినయ్. చిక్కుడుకాయలు, వంకాయలు, అనుపకాయలు, గోరుచిక్కుడు రూ.120 నుంచి రూ.140 తక్కువ లేదంటున్నారు. తప్పని పరిస్థితుల్లో కూరగాయలు కొనుగోలు చేయాల్సి వచ్చింది.

– కే.నరేష్, నెన్నెల

విచారణ హుళక్కేనా?

- పది రోజుల క్రితం ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన బీట్ ఆఫీసర్
- ఘటనపై ఇప్పటికీ విచారణ చేపట్టని అధికారులు

మంచిర్యాలక్రైం: కోటపల్లి అటవీ శాఖ రేంజ్ పరిధిలోని వెంచపల్లిలో బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న లత ఎఫ్‌ఆర్‌వో రవి, సెక్షన్ ఆఫీసర్ రాందాస్, క్లర్క్ ఖరీం వేధింపులు భరించలేక ఈ నెల 9న ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. పది రోజులు గడిచినా అటు ఉన్నతాధికారులు, ఇటు యూనియన్ నాయకులు పట్టించుకోవడం లేదని బాధితురాలు ఆరోపిస్తోంది. అటు పోలీస్ స్టేషన్లో, ఇటు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయకుండా కొందరు యూనియన్ నాయకులు, అధికారులు అడ్డుకోవడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. బాధితురాలు లత ఈ నెల 15న ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. వేధింపులకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 18న ఉన్నతాధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. పైగా బాధితురాలికి 2019 నుంచి వేతనం రావడంలేదని ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. ఎఫ్‌ఆర్‌వో రవిని కాపాడేందుకు అధికారులు, యూనియన్ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు బాధితురాలు ఫిర్యాదు చేయలేదని చెప్తూ విచారణలో జాప్యం చేసిన అధికారులు ఫిర్యాదు స్వీకరించిన తర్వాత ఏమేరకు న్యాయం చేస్తారో వేచి చూడాల్సిందే.

న్యాయం చేయాలి

నేను ఆత్మహత్యకు పాల్పడడానికి కారణమైన రవి, సెక్షన్ ఆఫీసర్ రాందాస్, క్లర్క్ ఖరీంపై చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయాలి. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసినప్పటికీ ప్లాంటేషన్‌కు సంబంధించిన బిల్లులు అడిగినందుకు వేధించారు. పైగా నీకు పిచ్చిలేసిందా.. మెంటల్ ఆస్పత్రికి వెళ్లమని, సమయపాలన లేకుండా ఆఫీస్‌కు రావాలని వేధించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డా.

– లత, బీట్ ఆఫీసర్

విచారణ చేస్తాం



బీట్ ఆఫీసర్ లత వ్యక్తి గత సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకుందని తెలిసింది. ఎఫ్‌ఆర్‌వో రవి, లత మధ్య ఉన్న డబ్బుల వివాదం నా దృష్టికి రాలేదు. బాధితురాలు ఆలస్యంగా ఫిర్యాదు చేసింది. ఆత్మహత్యాయత్నంపై డీఎఫ్‌వోకు చెప్పా. విచారణ చేయమని సూచించా.

– శాంతారామ్, సీఎఫ్‌వో, మంచిర్యాల

చర్యలు తీసుకుంటాం



లత ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యింది. ఇప్పటి వరకు ఇన్‌ఫార్మల్‌గా విచారణ చేశాం. అసలేం జరిగింది? అనే కోణంలో పూర్తిస్థాయి విచారణ చేయాల్సి ఉంది. విచారణ పూర్తయిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి, మంచిర్యాల

ఐఎన్‌టీయూసీ గెలిస్తే మళ్లీ పైరవీలే

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

రామకృష్ణాపూర్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయిందని టీబీజీకేఎస్ నాయకులంతా ఐఎన్‌టీయూసీలో చేరుతున్నారని, గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ గెలిస్తే మళ్లీ పైరవీలే షురూ అవుతాయని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సీహెచ్‌పీలో మంగళవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. వేజ్‌బోర్డులో మెరుగైన వేతన ఒప్పందాలు, కార్మికులకు లాభాల వాటా, లాభాల బోనస్ వంటివి తమ యూనియన్ పోరాటాల ఫలితంగానే సాధ్యమయ్యాయని అన్నారు. ఏరియాలో కంపెనీ క్వార్టర్లను టీబీజీకేఎస్ నాయకులు ఇష్టారీతిన కబ్జా చేసుకున్నారని, గని కార్మికులకు మంచి క్వార్టర్లు దొరికే అవకాశమే లేకుండా పోయిందని తెలిపారు. హక్కుల కోసం పోరాడే తమ సంఘాన్నే రాబోయే గుర్తింపు ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. యూనియన్ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ, హరిరామకృష్ణ, ముష్కె సమ్మయ్య, వేణుగోపాల్, సిరాజుద్దీన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం పోవాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జి వీకే బోసు



మాట్లాడుతున్న వీకే బోస్

శ్రీరాంపూర్: సింగరేణిలో రాజకీయ జోక్యం పోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఇంచార్జి వీకే బోసు తెలిపారు. మంగళవారం ఆయన ఆర్కే 5, ఎస్సార్పీ 3, 3ఏ గనులపై గేటు మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 27న జరగాల్సిన గుర్తింపు సంఘం ఎన్నికలను వాయిదా వేయకుండా నిర్వహించాలని తెలిపారు. కొన్ని సంఘాలు సింగరేణి ఎన్నికలు వాయిదా వేయాలని చూస్తున్నాయని, దీని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం వలే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల జాప్యం చేయాలని ప్రయత్నించడం సరికాదని తెలిపారు. యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరీ కొమరయ్య, నాయకులు వేణుమాధవ్, ప్రసాద్‌రెడ్డి, రాచర్ల చంద్రమోహన్, నర్సింగరావు, మురళి చౌదరి, అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

'సింగరేణి ఎన్నికలు వాయిదా వేయొద్దు'



మాట్లాడుతున్న రాజమౌళి

మందమర్రిరూరల్: ఈ నెల 27న నిర్వహించాల్సిన సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను వాయిదా వేయొద్దని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సిద్దంశెట్టి రాజమౌళి డిమాండ్ చేశారు. మంగళవారం ఏరియాలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కోర్టు తీర్పు వల్లనే ఎన్నికలకు యాజమాన్యం సిద్ధమైందని తెలిపారు. ఎన్నికల్లో ఒంటరిగానే పోటీలో ఉంటామని వివరించారు. ఈ సమావేశంలో యూనియన్ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు నరేందర్, సూర్య నారాయణ, వెంకటస్వామి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'బకాయిలు వసూలు చేస్తాం'



మాట్లాడుతున్న భూపాల్

శ్రీరాంపూర్: తాము గెలిస్తే సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.29 వేల కోట్లు వసూలు చేయిస్తామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ తెలిపారు. మంగళవారం ఆర్కే 6 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిలో మరిన్ని బొగ్గు బ్లాకులను ప్రైవేటు పరం చేయడానికి చూస్తోందని, దీన్ని అడ్డుకోవడం సీఐటీయూతోనే సాధ్యమని తెలిపారు. కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రశేఖర్ నాయకులు వెంకటేష్, రమేష్, సుధాకర్, ఆవునూరు మహేష్ పాల్గొన్నారు.

అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న ఎరుకల సంఘం నాయకులు

చెన్నూర్: ఎరుకల కులానికి చెందిన ఉండ్రాల లక్ష్మణ్, ఎల్లమ్మ, లచ్చన్నపై దాడి చేసిన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎరుకల ప్రజాసమితి జిల్లా అధ్యక్షుడు ఉండ్రాల ఎల్లయ్య డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ మంగళవారం స్థానిక అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా పందులను మేం పట్టుకుని తింటే కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. గిరిజన హక్కులను అధికారులు కాలరాస్తున్నారని ఆరోపించారు. కేసు విషయంలో మాట్లాడుదామని ఆఫీస్‌కు పిలిపించుకుని విచక్షణా రహితంగా దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. జిల్లా అధికారులు స్పందించి దాడికి పాల్పడిన వారిని విధుల నుంచి తొలగించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చకినారపు మల్లేశ్, రాసపాక మల్లేశ్, ఎరుకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథుల మహేశ్, జిల్లా ఉపాధ్యక్షులు పోచం, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం



మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపిస్తే కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. మంగళవారం ఎస్సార్పీ 1గనిపై కార్మికులను కలిసి మాట్లాడారు. నూతన భూగర్భ గనులను తీసుకువచ్చి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. గత గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ కార్మికుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఏఐటీయూసీ ఎర్రజెండా పేరుతో కార్మికులను మోసం చేస్తుందన్నారు. ఈ రెండు సంఘాల వల్ల సింగరేణిలో ప్రైవేటీకరణ పెరిగిందన్నారు. ఈ సందర్భంగా సుమారు 100 మంది కార్మికులు ఐఎన్టీయూసీలో చేరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు గరిగే స్వామి, తిరుపతిరెడ్డి, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ తిరుపతి రాజు, కేంద్ర కార్యదర్శులు సమ్ము రాజయ్య, మోతె రాఘవరెడ్డి, లాగల శ్రీనివాస్, చాట్ల అశోక్, పేరం రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీతోనే కార్మిక హక్కుల పరిరక్షణ



మాట్లాడుతున్న సిద్దంశెట్టి రాజమౌళి

తాండూర్: సింగరేణి కార్మిక హక్కుల పరిరక్షణ కేవలం ఐఎన్టీయూసీతోనే సాధ్యమని ఆ యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి రాజమౌళి అన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియాలోని వర్క్‌షాప్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపిస్తే ప్రతీ కార్మికునికి సొంతింటి పథకాన్ని వర్తింపజేస్తూ 250 గజాల ఇంటి స్థలంతో పాటు రూ.20 లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తామన్నారు. పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ రద్దు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పెరం శ్రీనివాస్, ఏరియా కార్యదర్శి మాధవకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుని కలిసిన అశోక్‌యాదవ్



మంత్రితో కొమ్ము అశోక్‌యాదవ్

భీమారం: గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గత ప్రభుత్వం మాదిరిగానే సబ్సిడీపై యాదవులకు గొర్రెలను అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి



యాదవరావు మృతదేహం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో జీఎం కార్యాలయం వద్ద గల ఎన్‌హెచ్ 363పై జరిగిన రోడ్డు ప్రమాదంలో పీ.యాదవరావు(43) అనే సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. ఘటనలో అతని భార్య సుజాతకు స్వల్పగాయాలయ్యాయి. గోదావరిఖనిలోని వకీల్‌పల్లిగనిలో విధులు నిర్వహిస్తున్న యాదవరావు గోదావరిఖని ఏరియాలోని 8 ఇంక్‌లైన్ కాలనీలో నివాసం ఉంటున్నారు. మంగళవారం దంపతులిద్దరూ స్వగ్రామం తిర్యాణి మండలంలోని బోరితం గ్రామం వెళ్లి వస్తుండగా బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న గార్డర్‌లకు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో యాదవరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు మృతి

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామసమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు సైఫ్ అలీఖాన్ (11) మంగళవారం మృతి చెందాడు. ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లాకు చెందిన పలువురు డబ్బా గ్రామంలో పత్తి ఏరే కూలీలుగా పనిచేయటానికి వచ్చారు. పనులు ముగించుకుని డబ్బా గ్రామానికి వస్తుండగా కాగజ్‌నగర్ వైపు వెళ్తున్న ట్రాలీ ఆటోలో ప్రయాణిస్తున్న సైఫ్ అలీఖాన్‌ను అతివేగంగా ఢీకొట్టింది. బాలుడి తలకు తీవ్ర గాయాలు కావడంతో కాగజ్‌నగర్ తరలించారు. వైద్యులు సూచన మేరకు మెరుగైన చికిత్స కొరకు కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆటో ట్రాలీ డ్రైవర్ అహ్మద్ అలీ అతివేగంగా నడిపి ప్రమాదానికి కారణమైనందున మృతుడి తండ్రి డల్లాఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో మంగళవారం ఉమ్మడి జిల్లా ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందులో డీడీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, ఏసీఎంఓ జగన్, ఉద్ధవ్, రాజమౌళి, శివాజీ, ఏటీడబ్ల్యూవోలు క్రాంతికుమార్, అమిత్, పురుషోత్తం, క్షేత్రయ్య తదితరులు పాల్గొన్నారు.

హాకీ విజేతలను అభినందించిన పీవో..

కామారెడ్డిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 బాలుర హాకీ పోటీలో విజేతగా నిలిచిన జిల్లా క్రీడాకారులను పీవో అభినందించారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో ఆత్రం భాస్కర్, పార్థసారధి, డీవో శివప్రసాద్, ఏటీడబ్ల్యూవో క్రాంతి, పీడీ, కోచ్‌లు హేమంత్, శ్రీనివాస్, శేఖర్, శివకృష్ణ, అతుల్ పాల్గొన్నారు.

ఐఎస్‌ఎల్ పోటీలు పకడ్బందీగా నిర్వహించాలి

ఉట్నూర్‌రూరల్: జనవరి 18 నుంచి 20 వరకు ఉట్నూర్‌లో జరుగనున్న ఇంటర్ సొసైటీ లీగ్ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కేబీ ప్రాంగణంలోని క్రీడా మైదానాన్ని పరిశీలించారు. క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు ఉండేందుకు ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పీవో వెంట డీడీ దిలీప్ కుమార్, జిల్లా క్రీడా అధికారి పార్థసారథి ఉన్నారు.